క్లుప్తంగా

ఆలయ కమిటీని రద్దు చేయాలి

సుజాతనగర్: శివాలయం కమిటీని రద్దు చేయాలని కోరుతూ దళిత ఐక్య వేదిక ఆధ్వర్యంలో కలెక్టర్ అనుదీప్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ.. పురాతన ఆలయంగా పేరొందిన శివాలయం కమిటీలో గతంలో దళితులు ఉండేవారని, ఇటీవల ఏర్పాటు చేసిన నూతన కమిటీలో దళితులకు అవకాశం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నూతన కమిటీపై సమగ్ర విచారణ జరిపి దళితుల ఆత్మగౌరవాన్ని కాపాడే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కసుకుంట్ల నిర్మల, దామర్ల సర్వేశ్వరరావు, కత్తి వెంకన్న, కాకటి బాబు, వేల్పుల భాస్కర్, కత్తి కృష్ణ, ఫ్రాన్సిస్, మురిపిటి నగేష్, రాజు, వెంకటేశ్వర్లు, నరేష్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం



ఆహ్వాన పత్రికలతో కమిటీ సభ్యులు

పాల్వంచ: పట్టణంలోని గుడిపాడు గ్రామంలోని శ్రీ మోక్ష వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఈనెల 6వ తేదీన శ్రీదేవి, భూదేవి సమేత మోక్ష వేంకటేశ్వర స్వామి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆరెం ప్రశాంత్ తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. శ్యామలా గోపాలన్ ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్ నల్లా సురేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ పునర్నిర్మాణ పనులు జరుగుతున్నట్లు చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.

కలశాభిషేకం..



1008 కలశాలతో పూజలు చేస్తున్న దృశ్యం

పాల్వంచ: పాత పాల్వంచలోని ప్రసిద్ధ శ్రీ అలివేలు మంగ, పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో పుష్కర బ్రహోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. మూడో రోజు శుక్రవారం ఆలయ పూజారి కందాల సింహాద్రి ఆనంద కుమారాచార్యులు నేతృత్వంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 1008 కలశాలతో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, పద్మావతి దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు. వందలాది మంది భక్తులు, మహిళలు భారీ సంఖ్యలో హాజరయ్యారు.

కొత్తగూడెం ఏరియా పరిధిలో..



స్వామివారి కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం ఏరియా పరిధిలోని 7 ఇంక్‌లైన్‌లో గుట్టపై ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణ మహోత్సవ వేడుకలను శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. రుద్రంపూర్, గౌతంపూర్, త్రీఇంక్‌లైన్, రామవరం, కొత్తగూడెం, విద్యానగర్‌కాలనీ, పెనగడప, రాంపురంలతో పాటు పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కొత్తగూడెం ఏరియా జీఎం జక్కా రమేష్ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి కల్యాణ మహోత్సవం వేడుకలను ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో వేదపండితులు శాస్త్రోక్తంగా జరిపించారు. అధిక సంఖ్యలో భక్తుల రాకతో ఆలయ ప్రాంగణం కోలాహలంగా మారింది. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

సంపత్‌నగర్‌లో..



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు

టేకులపల్లి: సంపత్‌నగర్ కొండపైనున్న వేంకటేశ్వర ఆలయంలో అలివేలుమంగ, పద్మావతి అమ్మవార్లతో వేంకటేశ్వర స్వామి కల్యాణ వేడుక శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు కొండపల్లి రాజగోపాలకిషన్ రజిత, అనువంశిక పారంపర్య ధర్మకర్తలు అజయ్‌కుమార్ సునాలిని, పవన్‌రావు మంగతాయారు దంపతుల ఆధ్వర్యంలో యాజ్ఞికులు శ్రీరంగం అజయ్‌సాయి చక్రిచార్యులు, శ్రీరంగం విజయ్‌సాయి చక్రిచార్యులు, ఇతర పూజారుల వేద మంత్రోచ్చరణలతో అంగరంగ వైభవంగా కల్యాణ వేడుకలు జరిగాయి. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఇల్లెందు ఎమ్మెల్యే బానోతు హరిప్రియ, హరిసింగ్‌లు కల్యాణ వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజ నిర్వహించారు.

పట్టణ ప్రజలకు ఆహ్లాదం

- తుది దశకు చేరుకున్న లేక్ వ్యూ పార్క్ నిర్మాణ పనులు
- త్వరలోనే ప్రారంభోత్సవం



నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్న ఇల్లెందు లేక్ వ్యూ పార్క్

ఇల్లెందు: సిరులు కురిపించే సింగరేణి పుట్టినియిన ఇల్లెందు పట్టణంలో ఆధునికతకు అద్దం పట్టేలా లేక్‌వ్యూ పార్క్ నిర్మాణం జరుగుతోంది. రూ.1.75 కోట్లతో చేపట్టిన పార్క్ పునర్నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. అనేక అవాంతరాల నడుమ అన్ని పనులు తుది దశకు చేరుకున్నాయి. 15 రోజులుగా రంగులు వేసే పనులు జరుగుతున్నాయి. ఏడాది క్రితం పనులు ప్రారంభించారు. వివిధ కారణాలతో పనులు నత్తనడకన సాగాయి. మున్సిపల్ పాలక వర్గం ఒత్తిడి తీవ్రతరం చేయటంతో ఆరు నెలలుగా ఊపందుకున్నాయి. పార్క్‌లో సుందరీకరణ పనులు ముమ్మరం చేశారు. ప్రహరీ, లైటింగ్ ఏర్పాటు చేశారు. ఫౌంటెన్ పనులు, చిన్నారుల కోసం ఆట వస్తువులు ఏర్పాటు చేశారు. ఇక్కడికి వచ్చే వారికి ఆహ్లాదం కలిగించేందుకు పచ్చదనం, పూలమొక్కలు, ఆట వస్తువులు, విశ్రాంతి తీసుకునేందుకు ఏర్పాటు చేసిన బల్లలు ఏర్పాటు చేస్తున్నారు.

పునర్నిర్మాణ పనులు...

2007లో అప్పటి కేంద్రమంత్రి రేణుకాచౌదరి ఈ పార్క్‌కు ప్రారంభోత్సవం చేశారు. సుమారు రూ.62 లక్షలు పార్క్ నిర్మాణానికి ఖర్చు చేశారు. అయితే కాలక్రమేణా ఈ పార్క్ ఆలనా పాలనా గాలికి వదిలేశారు. ఇదిలా ఉండగా 2016లో నాటి ఎమ్మెల్యే కోరం కనకయ్య, మున్సిపల్ చైర్మన్ మడత రమలు సీఎం కేసీఆర్‌ను, నీటిపారుదల శాఖ మంత్రి హరీష్‌రావును కలిసి ఇల్లెందుల పాడు చెరువును సిద్దిపేట తరహాలో.. మినీ ట్యాంక్ బండ్‌గా మార్చాలని విన్నవించారు. చెరువు పునరుద్ధరణ, చెరువు కట్టకు ఆనుకుని ఉన్న పార్క్‌ను అభివృద్ధి చేసేందుకు రూ. 3.37 కోట్ల నిధులు మంజూరు చేశారు. రూ. 1.75 కోట్లతో పార్క్, రూ.1.62 కోట్లతో చెరువు అభివృద్ధి చేపట్టాలని నిర్ణయించారు. అందులో భాగంగానే ఆరేళ్లుగా సాగుతున్న లేక్ వ్యూ పార్క్ ఎట్టకేలకు తుది దశకు చేరుకుంది.



సిద్ధమైన ఆట పరికరాలు

ఉగాది నాటికి ప్రారంభించాలి



ఆరు నెలలుగా పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. పట్టణ ప్రజలకు ఈ పార్క్ ఆహ్లాదం అందించనుంది. ఈ లేక్ వ్యూ పార్క్ పూర్తయితే సందడి పెరుగుతుంది. ఎంతోమంది తమ పిల్లాపాపలతో వచ్చి సేద తీరుతారు. పక్కనే గల చెరువు అందాలు తిలకిస్తారు. వచ్చే ఉగాది నాటిని పనులు పూర్తి చేసి పార్క్‌ను ప్రారంభించాలి.

– సయ్యద్ ఆజమ్, 3వ వార్డు కౌన్సిలర్, ఇల్లెందు

పనులు త్వరగా పూర్తి చేయాలి



ఇల్లెందు లేక్ వ్యూ పార్క్ పునర్నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి. వేసవి సెలవులకు ఇళ్లకు వచ్చే విద్యార్థులకు ఆహ్లాదం అందించేలా పార్క్ అందుబాటులోకి రావాలి. రూ.కోట్ల నిధులు ఖర్చు చేస్తున్న పార్క్ పట్టణ ప్రజలకు ఉపయోగపడాలి. పాలకవర్గం ప్రజలకు ఆహ్లాదం పంచిందనే భావన పట్టణ ప్రజలు కలగాలి.

– జేకే శ్రీనివాస్, 11వ వార్డు కౌన్సిలర్, ఇల్లెందు

మొక్కలు నాటిస్తున్నాం



ఇల్లెందు లేక్ వ్యూ పార్క్ పనులు చివరి దశకు చేరాయి. శానిటేషన్ పనులు పూర్తయ్యాయి. మొక్కలు నాటే పనులు మాత్రమే మిగిలి ఉన్నాయి. రంగుల వేసే పనులు తుది దశకు చేరింది. అధికారులకు పని ఒత్తిడి వల్ల కొంత జాప్యం జరిగింది. వచ్చే ఉగాది నాటికి అన్ని పనులు పూర్తి చేసి ప్రారంభించనున్నాం.

– డీవీ, చైర్మన్, ఇల్లెందు మున్సిపాలిటీ

ఇంటింటా స్వచ్ఛ భారత్ సర్వే

సుజాతనగర్: మంగపేట గ్రామంలో స్వచ్ఛ భారత్ నిర్వహణ తీరుపై అధికారులు శుక్రవారం ఇంటింటికీ వెళ్లి సర్వే చేపట్టారు. స్వచ్ఛ భారత్ మిషన్ శిక్షణ తరగతులను పురస్కరించుకొని మూడు రోజుల శిక్షణ ఏర్పాటు చేసిన విషయం విదితమే. ఇందులో భాగంగా రెండో రోజు ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఎఫ్ఏలు, వీఓఏలు 10 బృందాలుగా విడిపోయి ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహించారు. ఎన్ని ఇళ్లకు మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు ఎన్ని ఉన్నాయి, తడి, పొడి చెత్తను వేరు చేస్తున్నారా లేదా మొదలగు 29 అంశాలను నమోదు చేసుకున్నారు. అనంతరం గ్రామ ప్రధాన కూడలిలో గ్రామ చిత్రపటం వేసి అవగాహన కల్పించారు. అనంతరం స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని పాటిస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ టి.వెంకటలక్ష్మి, జిల్లా స్వచ్ఛ భారత్ కోఆర్డినేటర్ ఎం.రేవతి బూర్గంపాడ్ ఎంపీఓ సునీల్ కుమార్, ఈసీ సందీప్, ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఎఫ్ఏలు, వీఓఏలు పాల్గొన్నారు.



స్వచ్ఛ భారత్ ప్రతిజ్ఞ చేస్తున్న గ్రామస్తులు

ఐఎఫ్‌టీయూ సభలను విజయవంతం చేయాలి

పాల్వంచ: వచ్చే నెల 2, 3 తేదీల్లో కొత్తగూడెంలో జరగనున్న ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ద్వితీయ మహాసభలను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్.విశ్వనాథం అన్నారు. శుక్రవారం స్థానిక హమాలీ అడ్డా వద్ద పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విశ్వనాథం మాట్లాడుతూ.. కార్మికుల హక్కుల సాధనకై ఐఎఫ్‌టీయూ అనేక పోరాటాలు నిర్వహించిందని, బొగ్గు గని ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులను సంఘటితం చేసి వారి హక్కుల కోసం కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రైవేటీకరణను తిప్పికొట్టాలన్నారు. అమరజీ గట్టయ్య, కె.నాగేశ్వరరావు, కోటి, రామకోటి, విజయ్ పాల్గొన్నారు.

నర్సరీ సందర్శన

చుంచుపల్లి: ప్రశాంతినగర్ గ్రామ పంచాయతీలోని గరిమెళ్లపాడు నర్సరీని డీఆర్డీఓ మధుసూదన్ రాజు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. పెరిగే మొక్కలకు సపోర్టుగా కర్రలను ఏర్పాటు చేయాలన్నారు. మొక్కలకు ఎప్పటికప్పుడు ఎరువులు అందించాలన్నారు.

నిధులు కేటాయించండి

పాల్వంచరూరల్: మండలంలో నూతనంగా ఏర్పాటైన దంతలబోరు ఎస్సీకాలనీ గ్రామపంచాయతీ అభివృద్ధికి నిధులు కేటాయించాలని సర్పంచ్ గద్దల రమేష్ కోరుతూ.. శుక్రవారం జిల్లా పరిషత్ చైర్మన్ కోరం కనకయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. రైతులు పంటపొలాలకు వెళ్లేందుకు రహదారి సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అదే విధంగా వార్డులలో సీసీ రోడ్లు మంజూరు చేయాలని కోరారు.

సేవాలాల్ కమిటీ నియామకం

పాల్వంచ: సేవాలాల్ సేన జిల్లా కోకమిటీ చైర్మన్‌గా ధరావత్ ప్రేమ్‌చంద్ నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బానోత్ హుస్సేన్ నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడిగా గుగులోతు చంద్రు నాయక్ నియామకయ్యారు. శుక్రవారం స్థానిక బంజరా భవన్‌లో సేవాలాల్ సేన జిల్లా సమావేశం నిర్వహించారు. నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా నూనావత్ రవినాయక్, జిల్లా ప్రచార కార్యదర్శిగా బోడ రమేశ్‌లను ఎన్నుకున్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

టేకులపల్లి: సమాజంలో బాల్య వివాహాలను నిర్మూలించడంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఐసీడీఎస్ టేకులపల్లి ప్రాజెక్టు పరిధిలోని టేకులపల్లి సూపర్‌వైజర్ కె.అనురాధ పేర్కొన్నారు. ఈ మేరకు మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం రోళ్లపాడు అంగన్‌వాడీ కేంద్రంలో మహిళా దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. మాట్లాడుతూ.. బాల్య వివాహాలు తదితరాలు ఎవరైనా తమ దృష్టికి వస్తే 181 మహిళా కాల్ సెంటర్‌కు ఫోన్ చేస్తే సఖి సెంటర్ వారు రక్షణ కల్పిస్తారని, కౌన్సెలింగ్ నిర్వహించి కుటుంబ సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు.

సిమెంట్ బల్లలు వితరణ

జూలూరుపాడు: జూలూరుపాడు గ్రామానికి చెందిన సాయిన్ని గోపాల్‌రావు జ్ఞాపకార్థం అతని సోదరులు సాయిన్ని కృష్ణార్జున్‌రావు, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి నున్నా రంగారావులు సిమెంట్ బల్లలను వితరణ చేశారు. 25 సిమెంటు బల్లలను జూలూరుపాడు, వెంగన్నపాలెం గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో ప్రజలు కూర్చొనేందుకు వీటిని శుక్రవారం ఏర్పాటు చేశారు.

రోడ్డు నిర్మాణం

టేకులపల్లి: దాసు తండా నుంచి పంట పొలాలకు వెళ్లేందుకు రైతులు ఇబ్బందులు పడుతుండటంతో ఎమ్మెల్యే బానోతు హరిప్రియ స్పందించారు. తన సొంత ఖర్చులతో రోడ్డు నిర్మించనున్నారు. శుక్రవారం ఏఎంసీ చైర్మన్ బానోతు హరిసింగ్ నాయక్ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

బీజేపీని గద్దె దించుదాం..



జూలూరుపాడులో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

జూలూరుపాడు: కేంద్ర ప్రభుత్వం వంటగ్యాస్ ధరలను పెంచడాన్ని వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పొన్నెకంటి సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు శుక్రవారం జూలూరుపాడులో ధర్నా నిర్వహించారు. సతీష్ కుమార్ మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీని గద్దె దించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. లకావత్ గిరిబాబు, ఎంపీపీ లావుడ్యా సోనీ, ఎదళ్లపల్లి వీరభద్రం, బానోత్ నీల, గలిగె సావిత్రి, లావుడ్యా కిషన్‌లాల్ పాల్గొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో రాస్తారోకో..

పెంచిన వంటగ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం జూలూరుపాడులో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. గుండెపిన్ని వెంకటేశ్వర్లు, ఎస్కే నాగుల్‌మీరా, యల్లంకి మధు, సిరిపురపు వెంకటేశ్వర్లు, గుండెపిన్ని మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

జూలూరుపాడు: పెంచిన వంటగ్యాస్ ధరలకు వ్యతిరేకంగా సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం జూలూరుపాడులో కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. ఎస్కే ఉమర్, కందగట్ల సురేందర్, వై.గోపాల్‌రావు, బచ్చల లక్ష్మయ్య పాల్గొన్నారు.

టేకులపల్లి: వంట గ్యాస్‌పై పెంచిన ధరను తగ్గించాలని కోరుతూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించారు. కట్టెలపొయ్యిపై వంట చేసి నిరసన తెలియజేశారు. భూక్యా రాధ, బి.వరప్రసాద్, బోడ బాలు, బాలకృష్ణ పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: పెంచిన వంటగ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ఇల్లెందుతోపాటు కొమరారం, పోలారం గ్రామాలలో శుక్రవారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. తుపాకుల నాగేశ్వరరావు, సారంగపాణి, తోడేటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఇల్లెందు: గ్యాస్ ధర పెంచటాన్ని నిరసిస్తూ శుక్రవారం ఇల్లెందులో ఎమ్మెల్యే హరిప్రియ పట్టణంలోని పాత బస్టాండ్ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేశారు. రోడ్డు మీద కట్టెల పొయ్యిపై టీ కాచి ఆందోళనతో ఆగిపోయిన వాహన డ్రైవర్లకు అందజేశారు. రాస్తారోకో నిర్వహించారు. అనంతరం మోడీ సర్కార్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో బానోతు హరిసింగ్ నాయక్, దిండిగల రాజేందర్, పులిగళ్ల మాధవరావు పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: కేంద్రప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని రెడ్డిగూడెం, ఉల్వనూరు గ్రామాల్లో నిరసన వ్యక్తంచేశారు. వీరమల్ల ఉమ, కొండపనేని సత్యనారాయణ, వీరమల్ల మల్లయ్య, ఎల్లమ్మ, రేణుక, రాజేశ్వరి పాల్గొన్నారు.



పాల్వంచరూరల్: రెడ్డిగూడెంలో సిలిండర్లతో నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజాపంథా కార్యకర్తలు



ఇల్లెందురూరల్: నిరసన వ్యక్తం చేస్తున్న న్యూడెమోక్రసీ కార్యకర్తలు



టేకులపల్లి: ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

వార్డుల్లో ఎమ్మెల్యే పర్యటన



పట్టణంలోని డ్రైయినేజీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే హరిప్రియ, వైస్ చైర్మన్ జానీ, కమిషనర్

ఇల్లెందు: పట్టణంలోని పలు వార్డుల్లో ఎమ్మెల్యే హరిప్రియ పాదయాత్ర చేసి సమస్యలు తెలుసుకున్నారు. శుక్రవారం పట్టణంలోని 17,18,20 వార్డుల్లో పర్యటించారు. స్థానికులు రోడ్లు, విద్యుత్ స్తంభాల ఏర్పాటు, లైట్లు, తాగునీటి సరఫరా అంశాలను ఆమె దృష్టికి తీసుకొచ్చారు. వాటి పరిష్కారం కోసం చేపట్టాల్సిన చర్యలను కమిషనర్ అంకుషావలి, ఏఈ శంకర్‌లను అడిగి తెలుసుకున్నారు. తన వద్ద సుమారు రూ.50 కోట్లు నిధులు అందుబాటులో ఉన్నాయని, సీసీ రోడ్లు, డ్రైయినేజీలు ఏర్పాటు చేయనున్నట్లు హామీ ఇచ్చారు. దిండిగల రాజేందర్, పులిగళ్ల మాధవరావు, జానీపాషా, కొక్కు నాగేశ్వరరావు, పరుచూరి వెంకటేశ్వరరావు, సుధీర్‌తోత్లా, సిలివేరు సత్యనారాయణ, మనోహర్ తివారీ, గిన్నారపు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి



మాట్లాడుతున్న వెంకన్ననాయక్

ఇల్లెందు: బాల్యం నుంచే చదువును ఇష్టంతో అభ్యసించాలని శంషాబాద్ ఎయిర్‌పోర్టు అథారిటీ మేనేజర్ గంగావత్ వెంకన్ననాయక్ తెలిపారు. శుక్రవారం ఇల్లెందు గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల టెన్త్ విద్యార్థుల వీడ్కోలు సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాలను ధైర్యంగా ఎదుర్కొవాలని పేర్కొన్నారు. చదువుతోపాటు మనోధైర్యం పెంపొందించుకోవాలని, ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని సూచించారు. చదువుకు పేదరికం ఆటంకం కాదన్నారు. తాను బొజ్జాయిగూడెం బాలుర ఆశ్రమ పాఠశాలలో చదువుకున్నాట్లు తెలిపారు. నేటి ఆధునిక సమాజంలో ఉన్నత శిఖరాలను చేరుకోవాలంటే ఇంగ్లిష్ మీడియం తప్పనిసరి అని, ప్రభుత్వం పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టిందని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యార్థులు చదువు మీదే దృష్టి కేంద్రీకరించాలని, ఉన్నత లక్ష్యం చేరుకునేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎం టి.అనసూర్య, సమ్మయ్య, మాలోతు ప్రతాప్‌సింగ్ నాయక్, ఇందిర, సుజాత, పద్మ, రామకోటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల కేటాయింపుపై విచారణ జరపండి

సూపర్‌బజార్(కొత్తగూడెం): డబుల్ బెడ్ రూం ఇళ్ల కేటాయింపులో అవినీతి జరిగిందని సమగ్ర విచారణ జరిపించి అర్హులకే ఇళ్లు కేటాయించాలని కోరుతూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో బుధవారం డీఆర్ఓ అశోకచక్రవర్తికి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ఎస్సీ సెల్ స్టేట్ కన్వీనర్, టీపీసీసీ సభ్యులు జేబీ శౌరి, అర్జునరావు, ప్రకాశ్‌రావు పాల్గొన్నారు.

సింగరేణి(కొత్తగూడెం): నిరుపేదలను గుర్తించకుండా లాటరీ పద్ధతిలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు పంపిణీ చేయటం సరైంది కాదని, దీన్ని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా వ్యతిరేకిస్తుందని, ఆ పార్టీ పట్టణ కార్యదర్శి, లక్ష్మీదేవిపల్లి సంయుక్త కార్యదర్శి పి.సతీష్ ఖండించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే, అధికారులు ఆర్భాటంగా లాటరీ తీయడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. ఆర్డీఓ స్థాయిలో నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని విజ్ఞప్తి చేశారు.

పాల్వంచరూరల్: డబుల్ బెడ్ రూం ఇళ్ల ఎంపికలో అవకతవకలు జరిగాయని ఈ విధానాన్ని రద్దు చేసి అర్హులను ఇళ్లు కేటాయించాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎడవల్లి కృష్ణ డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్ వద్ద శుక్రవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. మాట్లాడుతూ.. ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న పేదలకు కాకుండా కేటీపీఎస్ ఉద్యోగులకు, రిటైర్డ్ ఎంప్లాయిస్ ఉద్యోగుల కుమారులకు ఇళ్లు కేటాయించారని ఆరోపించారు. అధికారులు విచారించి పేదలకు ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. నూకల రంగారావు, చారి, పైడిపల్లి మనోహర్‌రావు, బద్ది కిషోర్, ఎస్‌రే షఫీ, చంద్రగిరి, సత్యనారాయణ, కొండం వెంకన్న, బత్తుల వెంకటేశ్వరరావు, రాంబాబు పాల్గొన్నారు.

తహసీల్ వద్ద బీజేపీ నేతల బైఠాయింపు..

ఇళ్ల కేటాయింపులో అవకతవకలు చోటుచేసుకున్నాయని విచారణ జరిపి అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. బైరెడ్డి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు అన్యాయం జరిగింది..

పాల్వంచరూరల్: డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులో దివ్యాంగులకు అన్యాయం జరిగిందని దివ్యాంగులు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టీవీపీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు గుండపునేని సతీష్ మాట్లాడారు. దివ్యాంగులకు ఐదు శాతం ఇళ్లు కేటాయించాలని, కలెక్టర్ ఆదేశాలు ఉన్నా దివ్యాంగులకు కేటాయించకుండా అన్యాయం చేశారని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు దివ్యాంగులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో అబ్దుల్ నహీం, శ్రీను, ఆల్తాఫ్, రాంబాబు, ఫాతిమా, జురుబాబు, స్వప్న, సునిత, సాయి, బిందు, గోపీ పాల్గొన్నారు.



తహసీల్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న దివ్యాంగులు

పేదలను సొంత ఇంటికి దూరం చేశారు..



బీఎస్పీ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న పేదలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): డబుల్ బెడ్ రూంల ఎంపికలో పేదల సొంత ఇంటి కలను కల్లలుగా మిగిల్చారని, ఈ పథకాన్ని కూడా అధికార పార్టీ నాయకులు వదలలేదని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ విమర్శించారు. ఇళ్ల కేటాయింపులో అన్యాయం జరిగిందని నిరసిస్తూ శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కామేష్ మాట్లాడుతూ.. ఇళ్లు లేని పేదలు ఈసారి డబుల్ బెడ్ రూం ఇళ్లు వస్తాయని ఎంతో ఆశగా ఎదురుచూశారని కానీ, కొంతమంది ప్రజాప్రతినిధుల అవినీతి కారణంగా వారి ఆశలు అడియాసలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. లాటరీ విధానంలో ఎంపిక జరిగితే ఒకరోజు ముందుగానే వార్డు కౌన్సిలర్లు, ఇతర ప్రజాప్రతినిధుల జాబితా ఎలా వచ్చిందని ప్రశ్నించారు. ఒక ప్రజాప్రతినిధి భర్త డబ్బులు వసూలు చేసిన విషయంపై ఆడియో బయటికి వచ్చిందన్నారు. అర్హులకు ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంధ్య, గోపిశెట్టి ఆశాకుమారి, ఎడెల్లి మర్దమ్మ, సింగంశెట్టి వందన, ఎం.పద్మ, సయ్యద్ జైతున్నీసా, సంధ్య, హారిక పాల్గొన్నారు.

'డబల్' ఇళ్ల ఎంపికలో అవకతవకలు

పాల్వంచ: డబల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో అక్రమాలు జరిగాయని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నూకల రంగారావు విమర్శించారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. ఇళ్ల కేటాయింపుకు అధికార పార్టీ నేతలు వసూళ్లకు పాల్పడ్డారని ఆరోపించారు. అర్హులకు ఇళ్లు రాలేదని, నాయకుల అనుచరులకు, గవర్నమెంట్ ఉద్యోగం ఉన్న కుటుంబ సభ్యులకు ఇళ్లు కేటాయించినట్లు చెప్పారు. తక్షణం లాటరీనీ రద్దు చేసి అర్హులను ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఇళ్ల స్థలాలు ఉన్న వారికి ఇంటి నిర్మాణానికి రూ.5లక్షల అందిస్తామన్నారు. కార్యక్రమంలో చారి, బత్తుల వెంకటేశ్వరరావు, చంద్రగిరి సత్యనారాయణ, పైడిపల్లి మనోహర్, బత్తుల వెంకటేశ్వరరావు, కొండం వెంకన్న గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణులను రక్షిద్దాం..

ఇల్లెందురూరల్: వన్యప్రాణుల సంరక్షణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పోలారపు పద్మ అన్నారు. ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం 'వన్యప్రాణులు, ఆవాసం, జీవనం'పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. విశ్వంలో ఏకైక జీవగ్రహం భూమి మాత్రమేనని, అందులో అత్యంత తెలివైన జీవి మానవుడని చెప్పారు. మానవుడు తన అవసరాల పరిధి దాటి అత్యాశతో ఇతర జీవులను సంహరించడం వల్ల నేడు అనేక జీవరాశులు నశించిపోయే స్థితికి చేరుకున్నాయని వాపోయారు. ప్రకృతిని కాపాడటంతోపాటు వన్యప్రాణుల సంరక్షణను బాధ్యతగా భావించాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బిందుశ్రీ, ఇంద్రాణి, పిచ్చయ్య, కిరణ్‌కుమార్, డాక్టర్ సీహెచ్ రమేష్, సురేంద్రకుమార్, శేఖర్, రాజు, శ్రీకాంత్, సుజాత తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో ప్రిన్సిపాల్, అధ్యాపకులు